క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పార్కులో మొక్కలు నాటుతున్న సీపోర్ట్స్ లిమిటెడ్ సీఈఓ మురళీధర్

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాకినాడ సీపోర్ట్సు లిమిటెడ్ సీఈఓ ఎం.మురళీధర్ అన్నారు. రోటరీక్లబ్ కాకినాడ సన్‌రైజ్, కాకినాడ సీ పోర్ట్సు లిమిటెడ్, కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. సన్‌రైజ్ క్లబ్‌కు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ హరిబాబు, క్లబ్ సలహాదారుడు వి.రంగారావు, క్లబ్ కార్యవర్గ సభ్యులు నగధర్, వీవీ రాఘవులు, కెప్టెన్ జాకబ్ కమల్ సందీప్, దుర్గా మహేష్, తలారి రామచంద్రరావు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానమే..

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, సందర్భం ఏదైనా రక్తదానం చేయడం సాంప్రదాయంగా మార్చుకోవాలని రోటరీ క్లబ్ బ్లడ్‌బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ పేర్కొన్నారు. ట్రినిటీ హాస్పిటల్ అవరణలో మంగళవారం రోటరీక్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ సురభి శారద, రీక్కీ గూటమ్, టీవీ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి



పార్కులోని చెత్తను సేకరిస్తున్న విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్వచ్ఛభారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రియ హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పావని అన్నారు. స్థానిక శాంతినగర్‌లోని ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం 10 వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు రామచంద్ర మిషన్ పార్కులోని, రోడ్లపై చెత్తను సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ టి.నాగేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

కాకినాడ రూరల్: జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో 40 మంది దేశ జవాన్లు అమరులై నాలుగేళ్లు పూర్తయ్యాయని, వారి త్యాగాలు ఎన్నటికీ మరువలేమని ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అమర వీరుల త్యాగాల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ అటెండెన్స్‌పై వీఆర్‌ఏల ధర్నా



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

కాకినాడ సిటీ: వీఆర్‌ఏలకు ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ వేయాలనే నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ జిల్లా వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద నిరసన తెలియజేశారు. వీఆర్‌ఏల్లో ఎక్కువ మంది వయసు రీత్యా సచివాలయాలకు, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫేస్ యాప్ ద్వారా అటెండెన్స్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఎక్కువ మందికి సాంకేతికతను ఉపయోగించుకునేందుకు విద్యార్హత ఉండదని, అందువల్ల ఫేస్ యాప్ ఉపయోగించలేరన్నారు. ప్రభుత్వం పునరాలోచించి వీఆర్‌ఏలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే వారి డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం నాయకులు నిడమర్తి సురేష్ ఇజ్రాయేల్, గెడ్డం చిన బాబూజీ, పలివెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ప్రేమ శాశ్వతమైనది

కాకినాడ రూరల్: ప్రేమించడం తప్పుకాదని, ఆకర్షణతో కాకుండా స్వచ్ఛతతో ఉన్నప్పుడే అది శాశ్వతంగా నిలుస్తుందని న్యాయవాది యనమల రామం పేర్కొన్నారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమమే లక్ష్యం

- సంబంధిత చట్టంపై అవగాహన అవసరం
- అధికారులతో కలెక్టర్ కృతికా శుక్లా సమీక్ష



హెల్ప్ ఏజ్ ఇండియా రూపొందించిన ఎల్డర్ లైన్ జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వయోవృద్ధుల చట్టం–2007పై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ, హెల్ప్ ఏజ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులు, రెవెన్యూ, పోలీస్, వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వయోవృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం 2007లో ఈ చట్టం తీసుకువచ్చిందని, ఈ చట్టంపై మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ వివరించారు. ఇందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలన్నారు. వయోవృద్ధుల సమస్యలు, పరిష్కారానికి 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నంబర్‌ను ఉపయోగించుకోవచ్చని, హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ వయోవృద్ధుల సమస్యలపై సరైన మార్గనిర్దేశం చేస్తుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మరిన్ని సీనియర్ సిటిజన్, రెసిడెన్స్ సిటిజన్స్ అసోసియేషన్ల ఏర్పాటుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం హెల్ప్ ఏజ్ ఇండియా రూపొందించిన ఎల్డర్ లైన్ జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధులు పీపీటీ ద్వారా అధికారులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, ఆర్డీవో బీవీ రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ సిటిజన్స్ సంఘం ప్రెసిడెంట్ వెంపర్ల నారాయణమూర్తి, జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం, ప్రెసిడెంట్ బుద్దరాజు సత్యనారాయణరాజు, సభ్యులు రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, ఎల్డర్ లైన్ ప్రతినిధి పుష్పాంజలి, హెల్ప్ ఏజ్ ఇండియా ప్రతినిధి మృణాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

భద్రత పాటించని ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలి



ఫ్యాక్టరీల యాజమాన్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న రైతుకూలీలు

పెద్దాపురం: భద్రతా ప్రమాణాలు పాటించని ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరు శివారు పట్టణ పరిధిలోని ఒకటో వార్డు దమ్ముపేట ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పరిశ్రమల నిర్వహణపై ర్యాలీ నిర్వహించారు. వీరాంజనేయులు మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని భద్రత ప్రమాణాలు లేకుండా చాలా పరిశ్రమలు ఉన్నాయన్నారు. అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయన్నారు. ఇటీవల జి.రాగంపేట అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఏడుగురు మృతి చెందడం దురదృష్టకరమన్నారు. వల్లూరి రాజుబాబు, బి.రమేష్,. కణితి సతీష్, మడికి సత్యం, సురేష్, రైతు కూలీలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న చార్టెడ్ అకౌంటెంట్ భాను పృథ్వీరాజ్ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో యూనియన్ బడ్జెట్ ఫర్ డిజిటల్ ఇండియా–2023 అనే అంశంపై జాతీయ సదస్సును మంగళవారం నిర్వహించారు. కామర్స్ విభాగాపతి అజయ్ రతన్ కన్వీనర్‌గా వ్యవహరించగా ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర బడ్జెట్ దేశ ముఖ చిత్రాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. చార్టెడ్ అకౌంటెంట్ టి.భాను పృథ్వీరాజ్ విద్యార్థులకు బడ్జెట్‌పై అవగాహన కల్పించారు. డాక్టరు శ్రీరామరాజు, డాక్టర్ మధుకుమార్, డాక్టరు శ్రీదేవి, డాక్టర్ అప్పారావు, మణికంతేశ్వర్‌రెడ్డి, మనోజ్ దేవా తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

- విద్యార్థులకు ఇస్రో మాజీ శాస్త్రవేత్త శివప్రసాద్ పిలుపు



ఎగ్జిబిషన్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ సైంటిస్ట్ శివప్రసాద్, చిత్రంలో సుగుణారెడ్డి, ఏడీ నాయుడు

బాలాజీచెరువు: పరిశోధన వైపు విద్యార్థులు ఆలోచనలు చేసి సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలని ఇస్రో మాజీ సైంటిస్ట్ డాక్టర్ వై.శివప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరక్టర్ బీఈవీఎల్ నాయుడు అధ్యక్షతన ఆదిత్య డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్ సై–లాండ్–2023 ప్రారంభించారు. భారతదేశం విజ్ఞాన గగనమని, ఫిజిక్స్, కెమిస్ట్రీలో మరిన్ని నూతన అవిష్కరణలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సావనీర్‌ను అవిష్కరించారు. మరో ముఖ్య అతిథి నైరోస్ టెక్నాలజీ సీఈఓ పవన్ కుమార్ కంప్యూటర్ సైన్స్ అవశ్యకత తెలియజేయగా, కెమిస్ట్రీ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ మాచిరాజు కెమిస్ట్రీ క్లబ్‌లు ఏర్పాటుచేయాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా మోషన్ ఆఫ్ రాకెట్, త్రీడీ హాలోగ్రామ్, సోలార్‌బోట్, ఆల్కహాల్ డిటెక్టర్, బయో ఆర్గానిక్ ఫామ్, రైస్ డిటెక్టర్, కిడ్నీ క్యాన్సర్, సీ వాటర్ డీసాల్టేషన్, టైం స్పెంట్ ఆఫ్ స్టడీస్ ఫార్మ్స్ ఆఫ్ బిజినెస్ ఆర్గనైజేషన్ వంటి అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోబో జెన్ సీఈవో సిదార్థ రెడ్డి, కో–ఆర్డినేటర్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి

కాకినాడ: జగన్నాథపురం అన్నమ్మఘాటీ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో మంగళవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి ప్రారంభించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నతోపాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. పిఠాపురం ప్రాంతానికి చెందిన క్రైస్తవ ఆస్పత్రి కంటి వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు. సుమారు 350 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 42 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి పిఠాపురం ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: ప్రజలు, పారిశుద్ధ్య విభాగం సమన్వయంతోనే నగరాన్ని స్వచ్ఛ కాకినాడగా తీర్చిదిద్దగలమని అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. స్థానిక 8వ సర్కిల్ పరిధిలోని సినిమా రోడ్డు, మార్కెట్ ట్యాంక్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పూడిక తీత పనులను పర్యవేక్షించారు. అనంతరం పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఏడీసీ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుద్ధ్యంపై సిబ్బంది మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చెత్తను రోడ్లపైనా, డ్రైనేజీలలోను వేయకుండా ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలని సూచించారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా కూడా విధిస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యం కోసం సైక్లింగ్



సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతిప్రభ

కాకినాడ క్రైం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతిప్రభ సైకిల్ ర్యాలీ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేసీ ఇలాక్కియా మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం ఎన్నో కీలక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

కాకినాడ సిటీ: తూరంగి పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ వసుంధరాదేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఏసుదాసు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. వైద్య సిబ్బంది పీవీ ప్రకాశరావు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలంకలో..

కరప మండలం ఉప్పలంకలో ఆయుష్మాన్ భారత్ బ్లాక్ లెవెల్ హెల్త్ మేళా నిర్వహించారు. విద్యార్థులు, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎం ఎన్‌వీకె దుర్గాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

బోట్‌క్లబ్: నాయీ బ్రాహ్మణులకు దేవాలయాల పాలకమండళ్లలో చోటు కల్పిస్తూ జీవో జారీ చేసిన నేపథ్యంలో నగరంలోని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 150 యూనిట్ల ఉచిత విద్యుత్, చేదేడు వంటి పథకాలు నాయీ బ్రాహ్మణులకు గొప్ప వరమన్నారు. సంఘ నగర అధ్యక్షులు భీమనపల్లి వీరబాబు, ప్రధాన కార్యదర్శి స్వయంవరం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జి.గోపి, సలహాదారులు పి.అప్పారావు, శ్రీధర్, ఏసుబాబు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

కాకినాడ రూరల్: దివంగత నేత దామోదరం సంజీవయ్య జయంతిని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి విశ్రాంత గ్రంథాలయ ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రాజా, రేలంగి బాపిరాజు, శ్రీనగేష్ తదితరులు నివాళులర్పించారు.

చేనేత మార్కెటింగ్‌కే ఎక్స్‌పో–2023



హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–2023 వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

- కలెక్టర్ కృతికా శుక్లా
- వస్త్ర ప్రదర్శన, విక్రయాల ప్రారంభం

కాకినాడ సిటీ: చేనేత కార్మికులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించే నిమిత్తం జిల్లాలో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–2023 చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో దేవాలయం వీధిలోని పైడా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు ఈ వస్త్ర ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. రాయలసీమ మొదలుకొని ఉత్తర కోస్తా వరకు 14 జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో వరంగల్‌కు చెందిన వస్త్రాలతో 30 స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళగిరి, చీరాల, శ్రీకాళహస్తి కళంకారి, ఇతర రకాల చేనేత వస్త్రాలను ప్రదర్శించినట్టు తెలిపారు. వచ్చే నెలలో చేనేత కార్మికులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించే నిమిత్తం ఉప్పాడ, పెద్దాపురం, కోనసీమ కాటన్ వస్త్రాల విక్రయాలు పెంచేలా చేనేత వస్త్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 14 రోజుల పాటు ఈ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. భారత ప్రభుత్వం జిల్లాలో తాడిపత్రి, ప్రత్తిపాడు, ఉప్పాడలో మూడు చేనేత క్లస్టర్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ చేనేత క్లస్టర్‌లో ఆధునిక సాంకేతిక యంత్ర పరికరాలతో ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా కొత్త మోడల్ వస్త్రాలు రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ చేనేత వస్త్ర ప్రదర్శనను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శుక్లా కోరారు. ఉగాదిని పురస్కరించుకుని కాకినాడలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చేనేత జౌళిశాఖ ఏడీ పెద్దిరాజు తెలిపారు. ఈ ప్రదర్శనలో కేవలం ఉత్పత్తిదారులకు మాత్రమే స్టాళ్లు కేటాయించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పెట్టిన స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. చేనేత, జౌళిశాఖ రాజమహేంద్రవరం డీడీ బి.ధనుంజయరావు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌ఐ టెన్నిస్ పోటీల్లో కాకినాడ క్రీడాకారుల ప్రతిభ



ఎస్‌జీఎఫ్‌ఐ అండర్–19 టెన్నిస్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్: పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–19 రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో కాకినాడ క్రీడాకారులు దంతులూరి ప్రణీత్ వర్మ, నిశాంత్ ప్రతభ కనపరిచారు. ఈనెల 11 నుంచి 13 వరకు నరసారావు పేటలో ఈ పోటీలు జరిగాయి. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో తొలిసారి విజేతలుగా నిలిచారు. వీరు స్థానిక రాజేష్ టెన్నిస్ అకాడమీలో కోచ్ కె.రాజేష్ వద్ద శిక్షణ పొందుతున్నారు. వీరిని కోచ్‌లు శ్రీనివాస్ రెడ్డి, గణేష్ మంగళవారం అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

కరప: మండలంలోని పాతర్లగడ్డ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి లారీ ఢీకొనడంతో స్కూటరిస్ట్ గాయాలపాలయ్యాడు. కరప ఏఎస్సై సూరిబాబు తెలిపిన వివరాల మేరకు కాజులూరు మండలం చాకిరేవు మెరకకు చెందిన వేమగిరి సాగర్ కాకినాడలో పని ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పాతర్లగడ్డ వద్ద ఎదురుగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితుడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి కుమారుడు రవికిరణ్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

కరప: మండలంలోని వేములవాడలో సోమవారం రాత్రి జరిగిన కొట్లాటలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. కరప ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం వేములవాడలో సోమవారం రాత్రి గ్రామ దేవత ముసలమ్మతల్లి అమ్మవారి జాతర జరిగింది. ఈ జాతరకు కరపకు చెందిన పెదిరెడ్డి మణిదీప్, మరికొందరు యువకులు వెళ్లారు. జాతర జరుగుతుండగా స్థానికులతో మణిదీప్ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో వాసంశెట్టి రాంబాబుపై కత్తితో దాడిచేయడంతో కరప స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



నాగబాబు, పర్ణికను అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వివిధ విభాగాల్లో పతకాలు సాధించిన అథ్లెట్లను కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం అభినందించారు. పశ్చిమబెంగాల్ అరవిందో స్టేడియంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన 42వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ 2023 పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు, ఒక కాంస్య పతకం సాధించిన కాకినాడ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి యాతం నాగబాబును కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం అభినందించారు. ఈయన 4 ఇంటూ 100 మీటర్లలో మూడో స్థానం సాధించి కాంస్య పతకం, పరుగుపందెం, 400 మీటర్లు హర్డిల్స్‌లో స్వర్ణ పతకం, 4 ఇంటూ 400 మీటర్ల పరుగులో మొదటి స్థానంలో స్వర్ణ పతకం సాధించారు.

తైక్వాండో చాంపియన్ పర్ణికకు..

ఉత్తరప్రదేశ్‌లో జనవరి 27 నుంచి 29 వరకు జరిగిన 39వ జాతీయ జూనియర్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో 68 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన కాకినాడకు చెందిన కె.పర్ణిక మంగళవారం సాయంత్రం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను, కోచ్ బి.అర్జునరావు, చీఫ్ కోచ్ పి.శ్రీనివాసరావును కలెక్టర్ అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

హోంగార్డులకు ఆర్థిక సహాయం



విశ్రాంత హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో విధి నిర్వహణలో అకాలమరణం చెందిన హోంగార్డుల కుటుంబ సభ్యులతో పాటు పదవీ విరమణ చేసిన పలువురు హోంగార్డులకు ఎస్పీ చెక్కులు అందజేశారు. కొద్దికాలం క్రితం పదవీ విరమణ పొందిన వెంకటరమణ, సీహెచ్ భాస్కరరావులకు రూ.4.45 లక్షలు, రూ.4.48 లక్షలు అందజేశారు. అలాగే విధి నిర్వహణలో అకాలమరణం పొందిన శివకాశీప్రసాద్ భార్య రామతులసికి, గోవిందరాజు భార్య వెంకటలక్ష్మికి రూ.2.14, రూ.2.13 విలువైన చెక్కులు ఎస్పీ అందజేశారు. హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనాన్ని సమకూర్చి ఈ చెక్కులను అందజేసినట్టు ఎస్పీ తెలిపారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

పిఠాపురం: రైతు సంక్షేమ పథకాల అమలుకు తొలి మెట్టుగా ఈ క్రాప్ బుక్కింగ్ నిలుస్తుందని గుంటూరు వ్యవసాయ శాఖ జేడీ వీడీవీ కృపాదాసు అన్నారు. ఆయన వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏఓ టి.పద్మజా రాణితో కలిసి గొల్లప్రోలు మండలంలో పర్యటించి ఈక్రాప్ బుక్కింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాప్ బుక్కింగ్ చేయించుకున్న తరువాత మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. దీని ద్వారా రైతులకు అమలయ్యే క్రాప్ ఇన్సూరెన్సు, పంటనష్టం, ఇతర సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. అందుకే ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాఫ్ బుక్కింగ్ చేయించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈయన వెంట గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ, వీఆర్వో నూకరాజు, గ్రామ వ్యవసాయ శాఖ సంచాలకుడు వి.లక్ష్మీరెడ్డి, ఎం .సురేష్, బి.శ్రీను తదితరులున్నారు.

కేంద్ర బడ్జెట్, అదానీ అవినీతిపై 24న ధర్నా

కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, అదానీ అవినీతికి నిరసనగా ఈనెల 24న జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం సాయంత్రం సుందరయ్య భవన్‌లో దువ్వా శేషబాబ్జీ అధ్యక్షతన సమావేశం జరిగింది. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏవీ నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విరిగిన రైల్వే గేటు

పిఠాపురం: స్థానిక ఉప్పాడ రైల్వే గేటును లారీ ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు కొంత సమయం అంతరాయం ఏర్పడింది. రైల్వే అధికారులు హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని గేటుకు మరమ్మతులు చేయడంతో తిరిగి గేటు యథావిధిగా పని చేసింది.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరునెలల జైలు, రూ.2 లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.భరద్వాజ్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన పిల్లి వెంకటరమణ వద్ద నుంచి రౌతులపూడి మండలం రౌతులపూడి గ్రామానికి చెందిన మోకా రమేష్ 2016లో రూ.2 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2019లో రూ.2 లక్షల చెక్కు ఇచ్చాడు. చెక్కు బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో రమేష్‌పై నేరం రుజువు కావడంతో ఆరునెలల జైలు, రూ.2 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.